2,259 కేసులు పరిష్కారం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ న్యాయస్థానాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 2,259 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్ 10, క్రిమినల్ 2,140, ప్రి లిటిగేషన్-బ్యాంకు కేసులు 95, సైబర్‌క్రైమ్ 14 కేసులున్నాయి. మొత్తం రూ. 86,04,618 చెల్లింపులు జరిగాయి. జిల్లా న్యాయస్థానంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. కర్ణకుమార్ మాట్లాడుతూ వీలైన కేసుల్లో రాజీమార్గం ఉత్తమమని కక్షిదారులు గుర్తించాలన్నారు. సమయం, డబ్బులు వృథా కాకుండా లోక్‌అదాలత్‌లు ఉపయోగపడ్తాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను వీలైనంత వరకు సులభంగా, వేగంగా పరిష్కరించేందుకు ఇది చక్కని వేదికని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి రాధిక, జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవిష్య, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



కేసు పరిష్కారమైనట్లు పత్రం అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్

కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలి

నిర్మల్, న్యూస్‌టుడే: కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్వచ్ఛంద సంస్థ వరల్డ్ విజన్ ఇండియా అందజేసిన స్టడీ మెటీరియల్‌ను లక్ష్మణచాంద మండలంలో పదోతరగతి చదువుతున్న 364 మంది విద్యార్థులకు అందజేశారు. సంస్థ ప్రతినిధులను ఆమె అభినందించారు. డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎన్జీవో ప్రోగ్రాం అధికారి వై. బ్రహ్మన్న, ప్రతినిధులు అంబేడ్కర్, హంగమన్న, ఎస్ఆర్ పబ్లికేషన్ ప్రతినిధి సాయినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



అభ్యసన సామగ్రితో కలెక్టర్ అభిలాష అభినవ్, డీఈఓ రవీందర్‌రెడ్డి, విద్యార్థులు

అవగాహనే ముఖ్యం.. సాధనతో పదిలం



న్యూస్‌టుడే, దండేపల్లి :

విద్యార్థి ఉన్నత చదువులకు తొలిమెట్టు పదో తరగతి. మంచి జీపీఏ సాధించడంతో పాటు విషయ అవగాహనపై పట్టు పెంచుకుంటే ఇంటర్‌తో పాటు వివిధ సాంకేతిక కోర్సుల్లో చేరి ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం ఉంది. మార్చిలో పరీక్షలు ఉండటంతో సమయాన్ని వృథా చేయకుండా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలంటే ఏవిధంగా సాధన చేయాలి.. జీపీఏ పెరగాలంటే ఏయే అంశాలపై పట్టు సాధించాలో తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఈ నేపథ్యంలో గణితం, భౌతిక రసాయన, సాంఘిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...

సూత్రాలు.. గ్రాఫ్‌లు విజయానికి దోహదం

- గణితంలో సూత్రాలు, గ్రాఫ్‌ల నిర్మాణం మార్కులకు దోహద పడతాయి.
- బహుపదులు, సాంఖ్యక శాస్త్రం, రేఖీయ సమీకరణాలు, వర్గ సమీకరణాల నుంచి ఒక గ్రాఫ్ అడుగుతారు.
- సాంఖ్యక శాస్త్రంలో ఓజీ వక్రం, సమితుల్లో వెన్‌చిత్రాలు సాధన చేయాలి.
- త్రికోణమితిలో అనువర్తనాల నుంచి లెక్కలు అడుగుతారు. ఇందులోని కోణ విలువలు, సూత్రాలు చాలా ముఖ్యం.
- వాస్తవ సంఖ్యలు, సంభావ్యత, సమితులు, త్రికోణమితి, క్షేత్రమితి, నిరూపక జ్యామితి, శ్రేఢులు అధ్యాయాలను బాగా సాధన చేస్తే మంచి మార్కులు వస్తాయి.



-మిట్టపల్లి సంతోష్‌కుమార్, గణిత ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖానాపూర్, ఆదిలాబాద్ జిల్లా

ప్రయోగాలే ప్రధానం...



- ప్రయోగాలనుంచి ఒకటి అడుగుతారు.. ఇందులో ఉద్దేశం, పరికరాలు, ప్రయోగ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫలితాన్ని కచ్చితంగా సాధన చేయాలి. చక్కగా పటాలు గీసి భాగాలు గుర్తించాలి.
- సమస్యల సాధనకు సూత్రాలను గుర్తుంచుకోవాలి.
- పట్టికల విశ్లేషణ, బొమ్మలు, భేదాలు, ఉదాహరణలు, పోలికలు, పటాలలో తప్పులు సవరించడం తదితర అంశాలను గుర్తుంచుకోవాలి.
- సమీకరణాలను తుల్యం చేయటం, దర్పణాలలో, కటకాలలో ఏర్పడు ప్రతిబింబాలు, వీటి కిరణ చిత్రాలు, నిజజీవితంలో వీటి ఉపయోగాలు, ఓమ్ నియమం, నిరోధాల శ్రేణులు, విద్యుత్తు ప్రవాహంపై సాధన చేయాలి. నవీన ఆవర్తన పట్టిక, పరమాణు నిర్మాణం, క్వాంటమ్ సంఖ్యలు, ఆర్బిటాళ్ల ఆకృతులను అవగాహన చేసుకుంటే మంచి మార్కులు వస్తాయి.

-గోలి రాజగోపాల్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, పొన్కల్ పాఠశాల, నిర్మల్ జిల్లా

సమకాలీన అంశాలే కొలమానం

- పేరాగ్రాఫ్ ఇచ్చి విశ్లేషించడం, వ్యాఖ్యానించడం ద్వారా ఆరు మార్కులు వస్తాయి. పట్టిక ఇచ్చి దీనిలోని దత్తాంశాలను విశ్లేషించడం ద్వారా ఆరు మార్కులు సాధించవచ్చు.
- జనాభా, అక్షరాస్యత, దేశ సమగ్రత, గ్లోబల్ వార్మింగ్, హరిత హారం ఇలా అడిగే వ్యాసాలు రాసే తీరును తెలుసుకోవాలి.
- పటం, సమాచార నైపుణ్యాలు, వ్యాఖ్యానం, ప్రశంస, సమకాలీన అంశాలపై శ్రద్ధ చూపాలి.
- భారతదేశ భౌగోళిక స్వరూపం, ఉత్పత్తి ఉపాధి, నదులు, నీటి వనరులు, ఆహారభద్రత, సుస్థిర అభివృద్ధి, దేశ విభజన, స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ సాధన ఉద్యమ పాఠ్యాంశాలపై సాధన చేయాలి.
- జవాబులు పాయింట్ల వారీగా రాస్తే మంచి మార్కులు వస్తాయి.. **-జి.రవిశంకర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, గంగారాం పాఠశాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా**



పటాలు... పట్టికలను పట్టుబడితే చాలు..



- పటాల భాగాలు గుర్తించేటప్పుడు అన్ని ఒకవైపే రాయాలి.
- ప్రతీ పాఠంలో ఫ్లో చార్టు, భేదాలు, ప్రయోగశాల కృత్యాలు చేస్తే 10 మార్కులు వస్తాయి.
- కిరణజన్య సంయోగ క్రియ-శ్వాసక్రియ, అవాయుశ్వాసక్రియ-వాయుశ్వాసక్రియ, రక్తప్రసరణ, విసర్జన, లైంగిక ప్రత్యుత్పత్తి-అలైంగిక ప్రత్యుత్పత్తి, అనువంశికత, లింగ నిర్ధారణ, పోషకాహార లోపంతో కలిగే వ్యాధులు, నెఫ్రాన్ వ్యవస్థ అంశాలను చదివితే మంచి గ్రేడు సాధించవచ్చు.
- నేర్చుకున్న అంశాలను నిజ జీవితానికి అన్వయించే ప్రశ్నలు అడుగుతారు. వీటిని సాధన చేయాలి.

-గంప రవీందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, దండేపల్లి పాఠశాల, మంచిర్యాల జిల్లా

నాణ్యత పరిశీలించి.. సమస్యలు తెలుసుకొని..

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ కేజీబీవీ పాఠశాల, జూనియర్ కళాశాలను శనివారం మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీ విద్యార్థుల వంటకు ఉపయోగించే ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు చూశారు. విద్యార్థినులతో ఏకాంతంగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొన్ని సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకుల కొరత ఉందన్న విషయాన్ని, పలు సమస్యలను విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థినుల విన్నపాలను సానుకూలంగా స్పందించిన ఆమె తక్షణమే పరిష్కరించాలని డీఈవో రవీందర్‌రెడ్డిని కోరారు. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయాల్సిన నెంబర్లను క్లాస్‌బోర్డుపై రాసి మహిళందరికీ తెలపాలని సూచించారు. ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైన విషయాన్ని గ్రహించిన ఛైర్‌పర్సన్ వెంటనే ఆమెకు వైద్యసాయం అందించాలని అధికారులను ఆదేశించారు. చికిత్సను పర్యవేక్షించాలని డీఈవో, సంబంధిత ప్రధానోపాధ్యాయురాలిని కోరారు. అంతకుముందు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నేరెళ్ల శారదను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సన్మానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: నేరెళ్ల శారదను మండల కాంగ్రెస్ నాయకులు శనివారం నిర్మల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో నాయకులు ఈటెల శ్రీనివాస్, కొండ్ర నరేష్‌రెడ్డి, లింగన్న, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.



విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మహిళా కమిషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి విన్నవిస్తాం

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపివేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అల్లూరి మల్లారెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. దిలావర్‌పూర్‌లో పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా 68 రోజులుగా సాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం వారు సందర్శించారు. జిల్లా అధికారులు రైతుల సందేహాలను నివృత్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామస్థులు వారికి వివరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాగర్‌రెడ్డి, వివిధ పార్టీల మండల నాయకులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి

శ్రమ తోడైతే.. గెలుపు నీదే..



మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

● ఆ అధికారుల స్ఫూర్తితో ఐఏఎస్ సాధన

న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం:

పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధించగలం.. మంచి ఆలోచనలతో పనిచేసే అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. "జవహర్ నవోదయలో చదువుతున్న సమయంలో పాఠశాల ఛైర్మన్‌గా ఉన్న అప్పటి కలెక్టర్ నర్మదేశ్వర్‌లాల్ విద్యాభివృద్ధికి కృషి చేశారు. బిహార్‌లో కలెక్టర్‌గా పనిచేసిన కే. కే. పాటిల్ అవినీతిని నిర్మూలించి, పరిపాలన విభాగాలను గాడిలో పెట్టారు. ఆ అధికారులను స్ఫూర్తిగా తీసుకుని ఐఏఎస్ కావాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నా. అందుకు తగినట్లుగా సాధన చేశా. శ్రమతోడై నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించాను. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నా." విజయ ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే..

సర్కారు బడిలోనే చదువు

మాది సమస్తీపూర్ జిల్లాలోని ధరహర మండలం బిరోజ్‌పూర్ గ్రామం. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామంలో.. తర్వాత సమస్తీపూర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివా. ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఐఐటీ పూర్తి చేశా. అనంతరం ఓఎన్‌జీసీలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఐఏఎస్ కోసం సాధన చేశా.

20 గుంటల స్థలం మాత్రమే ఉంది

నాన్న విశ్రాంత ఉపాధ్యాయుడు మనోజ్‌కుమార్ సింగ్. తల్లి పుష్పకుమారి గృహిణి. అన్నయ్య ప్రభాత్ ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నాన్నకు 1982లో ఉపాధ్యాయుడిగా ఎంపిక జాబితాలో పేరు వచ్చింది. అప్పుడు ఆ ఉద్యోగం ఆయనకు ఇవ్వకుండా తక్కువ మార్కులు ఉన్న వ్యక్తికి ఇచ్చారు. న్యాయస్థానంలో కేసు వేసి గెలవడంతో 2012లో నాన్నకు ఉద్యోగం వచ్చింది. అందుకే తొమ్మిదేళ్లకే ఉద్యోగ విరమణ పొందాల్సి వచ్చింది. మాకు కేవలం 20 గుంటల స్థలం మాత్రమే ఉంది.

ఉద్యోగం చేస్తూనే సన్నద్ధమయ్యా

ఐఐటీలో మూడో సంవత్సరంలో ప్రభుత్వ కొలువు వచ్చింది. చదువు పూర్తయిన తర్వాత డెహ్రాడూన్‌లో ఆరేళ్లు ప్రభుత్వ ఉద్యోగం చేశా. ఆ సమయంలో ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యా. రెండుసార్లు రాత పరీక్షలో ఎంపికై ఇంటర్వ్యూలో విఫలమయ్యా. మూడోసారి ప్రయత్నించగా ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్)కు ఎంపికై ఇన్‌కం ట్యాక్స్ విభాగంలో పని చేశా. నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యా. 2018 బ్యాచ్‌కి చెందిన నేను మంచిర్యాల జిల్లాలో శిక్షణ కలెక్టర్‌గా.. తర్వాత పెద్దపల్లి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా మూడేళ్లు పని చేశా. అక్కడ పని చేస్తున్న సమయంలో కుటుంబ పెద్దలు స్వస్తికతో వివాహం జరిపించారు. ఆమె గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్నారు. తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా.. అక్కడి నుంచి ఇటీవల పదోన్నతిపై మంచిర్యాల జిల్లాకు కలెక్టరుగా వచ్చా.

తెలంగాణ వంటకాలంటే చాలా ఇష్టం


తెలంగాణలో నాన్‌వెజ్ వంటకాలు అంటే చాలా ఇష్టం. ఇక్కడ మటన్, చికెన్ వంటకాలు ఎక్కడా లేని విధంగా రుచిగా తయారు చేస్తారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్ అంటే ఇష్టం. క్రికెట్ ఆడను కానీ చూస్తా. టెన్నిస్ మాత్రం ఇంట్లోనే ఆడతా.

లక్ష్యంతో చదవాలి

మనం చదువుకోవడానికి ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోంది. యువత ప్రభుత్వ ఫలాలను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో దూసుకెళ్లాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంతో చదివితే అనుకున్నది సాధిస్తారు.

పల్లెల్లో ఆమెదే ఆధిక్యం

తుది ఓటరు జాబితా విడుదల ● మొత్తం 4,40,651 మంది ఓటర్లు



నిర్మల్, న్యూస్‌టుడే:

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పల్లె ఓటర్ల లెక్క తేలింది. శనివారం సాయంత్రం ఎన్నికల అధికారులు విడుదల చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలో 4,40,651 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 2,09,994, మహిళలు 2,30,641, ఇతరులు 16 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 20,642 మంది అధికంగా ఉన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మహిళలు 'కీ'లకం కానున్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. శాసనసభ, లోక్‌సభ ఓటరు జాబితాలో గుర్తించిన తప్పులను తొలగించారు. నమోదు, మార్పులు, చేర్పులతోపాటు సవరణల దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు.

రిజర్వేషన్లపైనే చర్చ.. పంచాయతీ ఎన్నికలపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. జిల్లాలో 400 పంచాయతీలు, 3,368 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. తుది ఓటరు జాబితా ప్రకటించిన నేపథ్యంలో పల్లెల్లో స్థానిక సంగ్రామంపై చర్చ మొదలైంది. ఆశావహులు రిజర్వేషన్ల ఖరారుపై తమ అనుచరగణంతో చర్చించడంలో నిమగ్నమయ్యారు. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను పదేళ్లకు పెంచుతూ తీసుకొచ్చిన చట్టం ప్రస్తుత సర్కారు కొనసాగిస్తుందా, లేదా అనే దానిపై చర్చ సాగుతోంది. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయో లేదోనని భావిస్తూనే మరోవైపు కీలక నేతలు సర్పంచులుగా పోటీచేయడానికి సిద్ధమవుతున్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడ్డ ఆయా పార్టీల ద్వితీయశ్రేణి నాయకులు పోటీకి ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో గట్టి పోటీకి సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎవరికి వారు తమ పార్టీ మద్దతుతో పోటీలో నిలవాలనుకుంటూ ఆశల లోకంలో విహరిస్తున్నారు.

జిల్లాలోని 18 గ్రామీణ మండలాల్లో ఓటర్ల వివరాలు

మండలం	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు
బాసర	10	90	7,427	7,956	01
భైంసా	30	258	15,970	17,269	02
దస్తురాబాద్	13	102	6,206	6,566	01
దిలావర్‌పూర్	12	108	8,574	9,866	00
కడెం	29	242	13,739	14,761	01
ఖానాపూర్	25	192	11,106	11,948	00
కుభీరు	42	344	19,430	20,300	01
కుంటాల	15	134	9,112	9,726	00
లక్ష్మణచాంద	18	162	11,125	12,907	01
లోకేశ్వరం	25	224	13,496	15,470	03
మామడ	27	222	12,067	13,685	00
ముథోల్	19	166	13,514	14,530	02
నర్సాపూర్(జి)	13	120	9,298	10,413	01
నిర్మల్ గ్రామీణం	20	170	10,343	11,865	00
పెంబి	24	152	5,264	5,581	01
సోన్	14	132	10,062	11,488	00
తానూరు	32	268	15,344	15,727	00
సారంగాపూర్	32	282	17,917	20,582	02

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

సారంగాపూర్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్ మండలం మీదుగా మహారాష్ట్ర సరిహద్దు సిర్‌పల్లి వరకు వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో ఈ రహదారి విస్తరించడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. కానీ సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామంలో మాత్రం రోడ్డు విస్తరణ జరగలేదు. ఈ గ్రామంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లడం కష్టంగానే ఉంటుంది. దీనికి తోడు ఉదయం, సాయంత్రం జీవాలు, పశువులు మేతకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తి వాహనాలు నిలిచిపోతుంటాయి. ఆదివారం ఈ మార్గంలో వాహనాల రద్దీ మరింత అధికంగా ఉంటుంది. అప్పుడు సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. రహదారి విస్తరించి ప్రయాణికులకు సులువైన రవాణ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



చించోలి(బి) రోడ్డు గుండా ఇబ్బందిగా వస్తున్న లారీ

వాగ్వాదాల మధ్య దుకాణ గదుల వేలం

భైంసా, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన 18 దుకాణాల గదులకు అధికారులు శనివారం వేలం పాట నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలం ప్రక్రియ ప్రారంభం కాగా విధివిధానాలపై స్పష్టత ఇవ్వక పోవడంతో అధికారులకు, దరఖాస్తుదారులకు వాగ్వాదం జరిగింది. ఒకే ధరకు ఒకే గదికి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే ఈ-ఆక్షన్ చేస్తామన్న అధికారులు, మళ్లీ లక్కీ డ్రా నిర్వహిస్తామనడంతో కొందరు వ్యతిరేకించారు. చివరికి సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తామనడంతో దరఖాస్తుదారులు శాంతించారు. 6గంటల వరకు బహిరంగ వేలం పూర్తి చేసి, గదులు దక్కించుకున్న వారితో ఒప్పంద పత్రాలు రాయించుకున్నారు. మార్కెట్‌శాఖ సంయుక్త సంచాలకుడు వి. శ్రీనివాస్, సహాయ సంచాలకుడు టి. శ్రీనివాస్, ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురియా, కార్యదర్శి పి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన దరఖాస్తుదారులు

రేపు నిర్మల్‌లో జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

నిర్మల్, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానంలో సోమవారం జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు జరుగుతాయని క్రీడల కన్వీనర్, డీఈవో రవీందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు స్టేడియంలో క్రీడా నిర్వాహకుడు, పీడీ భూమన్నకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని కోరారు.

మున్సిపల్ సమావేశం

ఖానాపూర్: ఖానాపూర్ పురపాలికలో పురపాలక సంఘం ఛైర్మన్ చిన్నం సత్యం అధ్యక్షతన శనివారం సాధారణ సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులతో పలు విషయాలపై చర్చించారు. ఉద్యానవనంలో సుందరీకరణ, జిమ్ పరికరాల మరమ్మతులు, పాత బస్టాండ్‌లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. వైస్ ఛైర్మన్ సంతోష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.





గుండె పోటు లక్షణాలు ఇవీ..

> 2024 నినాదం 'యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్'. 2025 నాటికి గుండె జబ్బు మరణాలను కనీసం 25 శాతం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ విషయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను విస్తృతంగా ప్రచారం చేయటానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ఇచ్చిన నినాదం ఇది.

రక్తం పోటెత్తి.. గుండె లయతప్పి

- పెరుగుతున్న బాధితులు
- నేడు 'ప్రపంచ హృదయ దినోత్సవం'

ప్రస్తుత జీవన విధానం, మానసిక ఒత్తిడి, మారిన ఆహారపు అలవాట్లతో ఉమ్మడి జిల్లాలో గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే వారి సంఖ్య పెరిగిపోతోంది. ప్రధానంగా మానసిక ఒత్తిడి కారణంగా రక్తపోటు(బీపీ) పెరిగి గుండె లయతప్పి మృత్యువాత పడుతున్న బాధితులు పెరిగిపోతున్నారు. బీపీ బారిన పడ్డ వారికి మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఏర్పడి అవి గుండెపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇది వరకు ఇలాంటి వారు అక్కడక్కడ మాత్రమే అరుదుగా కనిపించేవారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు, బీపీ, మధుమేహం బారిన పడుతున్నారు. రక్తపోటు వంశపార్యంపరంగా కూడా వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. దీని బారిన పడ్డ వారు మధుమేహం, థైరాయిడ్‌కు గురయ్యే అవకాశాలుంటాయంటున్నారు. యుక్త వయస్కుల్లో సాధారణ బీపీ 120(సిస్టోలిక్), 80(డయస్టోలిక్) ఉండాలి. రక్తపోటు వచ్చిన వారికి గుండె జబ్బుల ముప్పు పొంచి ఉందంటున్నారు.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం

తల్లి గర్భంలో నెలల శిశువుగా ఉన్నప్పుడే గుండె స్పందన ప్రారంభమై మనిషి మృతి చెందే వరకు రెప్పపాటు కాలం కూడా ఆగకుండా పని చేస్తుంది. కేవలం కొన్ని నిమిషాలు గుండె పని చేయటం మానేస్తే జీవితం అంతం అయిపోతుంది. అందుకే గుండెను ఆరోగ్యంగా కాపాడుకుంటేనే జీవించి ఉండగలుగుతాం. ప్రజలంతా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబరు 29న 'ప్రపంచ హృదయ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.87 లక్షల మంది బాధితులు

ఆదిలాబాద్	నిర్మల్	కుమురం భీం	మంచిర్యాల
32,995	75,563	19,003	60,071

● జిల్లా ● రక్తపోటు బాధితులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవి..

- అనునిత్యం శారీరక శ్రమ ఉండాలి, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- అధిక పోటాషియం ఆహారం (ఆకుకూరలు, కూరగాయలు) తీసుకోవాలి.
- నూనె పదార్థాలు, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండటం మంచిది
- ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి
- ఉప్పు అధికంగా వాడొద్దు
- రోజూ 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి.
- ఏదైనా తీవ్ర ఒత్తిడికి గురైతే ఉపశమనం కోసం క్రీడలు, ఇతర వ్యాపకాలపై దృష్టి సారించాలి

లక్షణాలుంటే వైద్యుడిని సంప్రదించాలి

- కస్తూరి శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్, రిమ్స్



గుండె సంబంధిత వ్యాధులు, బీపీ లక్షణాలు ఏమాత్రం ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో మందులు వాడాల్సి ఉంటుంది. లేకుంటే ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. రోజూ కాసేపు వ్యాయామం చేస్తే వీటి ముప్పును చాలా వరకు తగ్గించుకోవచ్చు.

ఇబ్బందులను నిర్లక్ష్యం చేయొద్దు

- రాజేష్, గుండె వైద్యనిపుణులు, మంచిర్యాల



ఛాతిపై ఒత్తిడి, అసౌకర్యం, కళ్లు నొప్పులు, చేతులు అలసట, చెమటలు పట్టడం, తల తిరగడం, వేగంగా గుండె కొట్టుకోవడం ఇలా ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించాలి. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పరిణామాలు తీవ్రంగా ఉండటమే కాకుండా ప్రాణహాని ఉండే అవకాశం ఉంది. ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా అశ్రద్ధ చేయవద్దు. జీవనశైలి, ఆహార అలవాట్లు ఆరోగ్యకరంగా ఉంచుకోవాలి.

ఎరుపెక్కిన అంబరం.. చూపరులకు సంబరం

కారుమబ్బులు చీల్చుకుంటూ సూర్యోదయం వేళ భానుడి అరుణ కిరణాలతో ఆకాశం ఎరుపెక్కింది. మబ్బులన్నీ ఎరుపు వర్ణాన్ని సంతరించుకున్న అంబరం చూపరులకు సంబరాలను నింపి ప్రకృతి రమణీయతను చాటింది. మెల్లమెల్లగా సూర్యుడు బయటకు రావడంతో ఆకాశం ఎరుపు వర్ణాన్ని వీడి నీలం రంగులోకి మారింది. నింగిలో ఈ సుందర దృశ్యం ఖానాపూర్, భైంసా మండలం ఇలేగాం, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 5:30 తర్వాత ఆవిష్కృతమైంది. తెల్లవారడంతోనే ప్రజలకు కనువిందు చేసింది.

- ఖానాపూర్, భైంసా, న్యూస్‌టుడే



నరభక్షక పులి చేజిక్కే..



స్పృహ కోల్పోయిన టి-83 పులి వద్ద అటవీ అధికారులు

బల్లార్ష, న్యూస్‌టుడే : మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా మూల్ తాలూకా చిచ్‌పల్లి అటవీక్షేత్రంలో నలుగురిని హతమార్చిన టి-83 అనే పులిని శనివారం అటవీశాఖ అధికారులు బంధించారు. జనాడా, కాంతాపేట్, చిరోలి, కరడ్‌పేట్, చించాడా తదితర గ్రామ పరిసరాల అడవుల్లో సంచరిస్తూ పదిహేను రోజుల్లో నలుగురు పశువుల కాపరుల ప్రాణాలు తీసింది. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. రాష్ట్ర అటవీశాఖ మంత్రి మునగంటివార్ ఇటీవల పులిని వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈక్రమంలో అధికారులు అడవిలో పలుచోట్ల బోన్లు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమర్చారు. ఈ ప్రయత్నాలు విఫలం కావడంతో డ్రోన్ సాయంతో శనివారం జనాడా గ్రామ పరిసర అడవుల్లో సంచరిస్తోందని గుర్తించారు. ప్రముఖ షూటర్ అజయ్ మరాఠే సాయంతో పులికి మత్తుమందు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశారు. అభయారణ్యాల పశువైద్యాధికారి రవికాంత్ దేశ్‌పాండే పరిశీలించిన తర్వాత దాన్ని చంద్రపూర్ కేర్ సెంటర్‌కు తరలించారు.

పుస్తకాల కింద పాము..



కౌటాల, న్యూస్‌టుడే : కౌటాల మండలంలోని కన్నెపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాము కలకలం సృష్టించింది. ఉదయం వచ్చిన విద్యార్థులు తరగతి గదిలో కూర్చొని ఉండగా పుస్తకాల కింద పాము ఉండడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు వెంటనే స్పందించడంతో స్థానికుల సహాయంతో దాన్ని చంపారు. ప్రహరీ గోడ లేకపోవడంతో తరచూ బడి ఆవరణలోకి విషపురుగులు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయురాలు అనూష తెలిపారు.

తిరుపతి ఘటనపై న్యాయవిచారణ జరపాలి : వీహెచ్‌పీ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతిలో లడ్డూ ప్రసాదంలో కల్తీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ డిమాండ్ చేశారు. నిర్మల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలియుగదైవంగా భక్తులు పూజించే ఆలయంలో అపవిత్రత చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దేవాదాయశాఖను రద్దుచేసి, ధార్మిక వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 30న నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందూరు విభాగ్ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పతికె రాజేందర్, జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, సాదం ఆనంద్, పతికె రమేశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకుంటే కిడ్నీలు అమర్చుతాం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : డయాలసిస్ బాధితులు దరఖాస్తులు చేసుకుంటే లభ్యతను బట్టి ఉచితంగా నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీలను జీవన్‌దాన్‌లో భాగంగా అమర్చే ఏర్పాటు చేస్తామని హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ వైద్యుడు కార్తిక్ పేర్కొన్నారు. ఆయనతో పాటు నిమ్స్ మరో నెఫ్రాలజిస్ట్ శశాంక్‌లు రిమ్స్ డయాలసిస్ కేంద్రాన్ని శనివారం సందర్శించి పరిశీలించారు. జీవన్‌దాన్ గురించి అవగాహన కల్పించారు. రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాథోడ్ జైసింగ్, అపెక్స్ క్వాలిటీ మేనేజర్ జీవన్, కేంద్రం బాధ్యుడు ప్రేందాస్ సిబ్బంది ఉన్నారు.



రిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిమ్స్ ఆసుపత్రి వైద్యులు

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.





> రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

- నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలోని ఒక కాలనీలో మూడేళ్ల చిన్నారిపై దాదాపు 45 సంవత్సరాల వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. అదే కాలనీకి చెందిన నంద కుమార్ అనే వ్యక్తి మరుగుదొడ్డిలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు చిన్నారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.

సిమెంటు ఇటుకలతో.. మనసుదోచే శిల్పాలు

- విశ్రాంత ఉద్యోగి కళారాధన

ఈటీవీ - ఆదిలాబాద్ :

అయోధ్యలో కొలువుదీరిన రాంలల్లా. శాంతిని ప్రబోధించే గౌతముడు. హంపినగర శిల్ప సౌందర్యం. కాకతీయ సామ్రాజ్య కళా వైభవం. అన్నీ ఒకే చోట కొలువైతే. ఎంత బాగుంటుంది. దాన్ని సుసాధ్యం చేశారో విశ్రాంత ఉద్యోగి. ఆరు పదుల వయసులో తనలో దాగి ఉన్న శిల్పకళను తట్టిలేపారు. మనసును మంత్రముగ్ధులను చేసే ఎన్నో కళాకృతులకు జీవం పోశారు. కళారాధనంటే వ్యాపార దృక్పథం కాదు. మనసును తేలిక పర్చుకోవడమనేలా సాగుతున్న శిల్ప కళా సౌందర్యంపై 'ఈటీవీ - ఈనాడు' ప్రత్యేక కథనం.

ఆదిలాబాద్‌లోని జీఎస్ కాలనీలో నివాసం ఉండే కె.జ్యోతిశ్రీ-కేవీ రావు దంపతులది సాధారణ మధ్య తరగతి కుటుంబం. సిమెంటు పరిశ్రమ విశ్రాంత ఉద్యోగి అయిన కేవీరావుకు చిన్నప్పటి నుంచి కళలంటే అమితమైన ఆసక్తి. కరోనా సమయంలో తన కళా నైపుణ్యానికి పదునుపెట్టారు. మార్కెట్లో లభించే సిమెంటు ఇటుకలను కొనుగోలు చేసి శిల్పాలుగా మలచడం ప్రారంభించారు. సుద్దముక్కలను శిల్పాలుగా తీర్చిదిద్దేందుకు యత్నించారు. ఎన్నోసార్లు విఫలయ్యారు. సుద్దముక్కలు, ఇటుకలు విరిగిపోయాయి. వినియోగించిన చిన్నపాటి ఉలి, రంపంతో చేతివేళ్లకు గాయాలయ్యాయి. అయినా పట్టువీడలేదు. ఆలోచనను విరమించుకోలేదు. ఎన్నో అబ్బురపరిచే కళాకృతులకు ప్రాణం పోశారు. చూపరులను మంత్రముగ్ధులను చేసే శిల్పాలను తీర్చిదిద్దారు. ఆయన ఇంట్లోని ఓ గది చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని తట్టిలేపే ఎన్నో శిల్పాలతో నిండిపోయి ఉందంటే ఆశ్చర్యం వేయకమానదు.





ప్రతిమలను చెక్కుతున్న కేవీరావు

చిత్రం విచిత్రమే..

ఆరు అంగుళాల సుద్దముక్క నుంచి మొదలుకొని రెండు అడుగుల వరకున్న తేలికపాటి సిమెంటు ఇటుకలే ముడిసరకుగా బొమ్మలుగా చెక్కడంలో ఆయన దిట్ట. ఇటుకపై తయారు చేసిన బుద్ధుడి బొమ్మను చూస్తే హుస్సేన్‌సాగర్‌లో ఉన్న ప్రతిమ చిత్రంగా అనిపిస్తుంది. రెండు అంగులాల సుద్దముక్కపై చెక్కిన శివాజీ ముఖాన్ని చూస్తే చాలు ఆశ్చర్యం వేయకమానదు. దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, నాట్యభంగిమలు, ఏనుగులు, గుర్రాలతో కూడిన శిల్ప సౌందర్యం, సింగపూర్ రాజముద్ర, గోడలకు అతికించేలా దేవతాప్రతిమలు, టీవీ స్టాండ్లు ఇలా ఎన్నో ఆకృతులకు ప్రాణం పోస్తున్నారు.

స్నేహితులకు, బంధువులకు బహుమతులుగా..

తయారు చేసిన శిల్పాల క్రయవిక్రయాలకు ప్రాధాన్యం ఇవ్వరు. వివాహాలు, ఇతర శుభ కార్యాల్లో బహుమతులుగా అందజేస్తారు. స్నేహితులకు బహుమానంగా ఇస్తారు. ఇటుకలు కొనిచ్చి తమకు కావాల్సిన ప్రతిమను తయారుచేయమని మిత్రులు అడిగితే ఉచితంగానే చేసి ఇస్తారు. నేను ఎంచుకున్న కళారాధన వ్యాపారం కోసం కాదు. మానసిక ఆనందం కోసమే. సతీమణి జ్యోతిశ్రీ ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని కేవీరావు చెబుతుంటారు.



తయారు చేసిన శిల్పాలతో కేవీరావు దంపతులు



మేమున్నాం.. మీకు తోడుగా...
నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

?: నర్సాపూర్(జి) మండలం బామ్ని గ్రామంలో మిషన్‌భగీరథ పైపులైన్ పగిలి నీరు కలుషితమవుతోంది. -గ్రామస్థులు

✓వెంటనే పైపులైన్ మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. -రాజశేఖర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ -న్యూస్‌టుడే, నర్సాపూర్(జి)


బామ్ని(బి)లో కలుషితమవుతున్న నీరు

రక్షణ గోడ నిర్మాణం ప్రారంభం

నిర్మల్ గ్రామీణం: నిర్మల్-భైంసా రహదారిలో చిట్యాల్ వంతెనపై కూలిన గోడ పునర్నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20న 'ఈనాడు'లో 'ఇరుకు వంతెనపై ప్రయాణ కష్టాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పనులు మొదలుపెట్టారు.


చిట్యాల్ వంతెనపై చేపట్టిన నిర్మాణ పనులు

సమస్య పరిష్కరించారు

ఈనాడు స్పందనకు వందనం

భైంసా గ్రామీణం: భైంసా-నిర్మల్ జాతీయ రహదారి-61పై వానల్‌పాడ్ సమీపంలో ఇరుకు వంతెన వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వంతెన రక్షణ గోడ దెబ్బతినడంతో ప్రమాదాలకు నిలయంగా తయారైంది. ఈ సమస్యపై ఆగస్టు 15న 'ప్రమాదమని తెలిసినా పట్టింపు కరవు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రక్షణ గోడను నిర్మించారు.


వానల్‌పాడ్ సమీపంలో వంతెనపై నిర్మించిన రక్షణ గోడ

నిలిచిన చెల్లింపులు!

● ఆందోళనలో యూబిట్ కాయిన్ సభ్యులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పెట్టుబడులకు సంబంధించిన యూబిట్ కాయిన్ వ్యవహారంపై ఇప్పటికే కేసు నమోదైంది. పలువురు కీలక సభ్యులు అరెస్టు అయ్యారు. విచారణ కొనసాగుతోంది. అయితే.. ఇందులో పెట్టుబడి పెట్టిన చాలామంది పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకురావడం లేదు. కారణం.. పెట్టిన పెట్టుబడులకు వారు చెప్పినరీతిలో వడ్డీ, కమీషన్ ఎప్పటికప్పుడు జమవుతుందన్న ఆశ వారిని మిన్నకుండేలా చేసిందని ప్రచారం జరుగుతోంది. అయితే.. రెండురోజులుగా చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోవడంతో సభ్యుల్లో కలవరం మొదలైంది.

ఒకరిని చూసి మరొకరు..

స్టార్‌లుగా ఉన్నవారే కాకుండా కిందిస్థాయి సభ్యులు, కొత్తగా పెట్టుబడులు పెట్టినవారు.. తమ పెట్టుబడికి అనుగుణంగా క్రమం తప్పకుండా వడ్డీ, కమీషన్ డబ్బులు పొందేవారు. దీంతో ఒకరిని చూసి ఒకరు ఆశకు పోయి డబ్బులు పెట్టారు. ఇదంతా కాయిన్ రూపంలో జరిగేది. రెండురోజులుగా చెల్లింపుల ప్రక్రియ కనిపించకపోవడంతో సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ తతంగం నిర్వహిస్తున్న అసలు వ్యక్తులు చేతులెత్తేశారా లేక దర్యాప్తు నేపథ్యంలో పోలీసులు చెల్లింపులను స్తంభింపజేశారా అనే సందిగ్ధంలో పడిపోయారు. పెట్టిన డబ్బులు ఇప్పటికే వెనక్కి వచ్చేసిన వారిలో అంతగా ఆందోళన లేకపోయినప్పటికీ, అప్పు చేసి, ఆస్తులు తాకట్టుపెట్టి మరీ పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి ఇంకా పూర్తిస్థాయిలో తిరిగిరాని వారిలో ఆదుర్దా మొదలైంది. తమ డబ్బులు తమకు తిరిగొస్తాయా లేదా అనే గందరగోళంలో ఉన్నారు. పోలీసులకు ఫిర్యాదుచేయాలా వద్దా అనే విషయం తేల్చుకోలేకపోతున్నారు.

ప్రధాన సూత్రధారిని గుర్తించేందుకు..

ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో ప్రధాన సూత్రధారిని పోలీసులు ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. మనదేశానికే చెందిన వ్యక్తి అయినా అతడు విదేశాల్లో ఉంటున్నట్లు గుర్తించారు. జిల్లాలోనే కాకుండా దేశవ్యాప్తంగా అతడి బారిన పడి నష్టపోయిన బాధితులున్నారు. అతడిపై ఇప్పటికే పలు ఆదాయ సంబంధిత కేసులు నమోదైనట్లు పేర్కొంటున్నారు. కాగా.. సదరు అనుమానితుడు తరచూ ఇదేరీతిలో వివిధ పేర్లతో కాయిన్ దందా కొనసాగిస్తుంటాడని, మొదట్లో డబ్బులు ఇచ్చి ఆ తర్వాత బోర్డు తిప్పేయడం సర్వసాధారణమని చెబుతున్నారు. ఈ కారణంగానే ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారాన్ని చూసి మోసపోవద్దని, ఆశకు పోయి డబ్బులు నష్టపోవద్దని తరచూ హెచ్చరిస్తున్నారు. అయినా, స్థానికంగా ఉండే కొందరు వ్యక్తులు తమకొచ్చే లాభాలకు ఆశపడుతూ పెద్దసంఖ్యలో ప్రజలను ఇందులో సమిధలుగా మారుస్తున్నారు. కాగా.. ప్రధాన సూత్రధారిగా పేర్కొంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు జిల్లా పోలీసులు చర్యలు చేపట్టే అవకాశముంది. విచారణ నేపథ్యంలో వివరాలు వెల్లడించబోమని, కేసు పురోగతిని బట్టి ఎప్పటికప్పుడు సమాచారం మీడియాకు అందిస్తామని పోలీసులు చెప్తున్నారు.


విత్తనబంతులు తయారు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, వాసవి క్లబ్ సభ్యులు

విత్తనబంతుల తయారీలో రికార్డు సృష్టిస్తాం

ఖానాపూర్, న్యూస్‌టుడే: అటవీ పచ్చదనం వచ్చే తరానికి అందించేందుకు వాసవి క్లబ్ కృషిచేస్తుందని ఆ క్లబ్ రీజియన్ ఛైర్మన్ మహాజన్ జితేందర్ అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులతో విత్తనబంతులను తయారు చేసే కార్యక్రమం నిర్వహించారు. వనిత క్లబ్ ఆధ్వర్యంలో 5600, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 5300 విత్తన బంతులు తయారుచేశారు. వాసవి అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ పిలుపు మేరకు కోటి విత్తనబంతుల తయారీలో భాగస్వాములై గిన్నిస్‌బుక్ రికార్డు సాధనకు కృషిచేస్తామని చెప్పారు. క్లబ్ సభ్యులు మానస, ప్రమోద్, వరలక్ష్మి, శ్వేత, రాధిక, సరిత, చంద్రశేఖర్, రవీందర్, సంతోష్, పాఠశాల ప్రిన్సిపల్ పడాల ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ బృందాలు

ముథోల్: ఉపాధి హామీ పథకం పనుల తనిఖీకి ఆదివారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలకు వెళ్తున్నాయి. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో తనిఖీ బృందాల సభ్యులు ఆయా గ్రామాల పనుల దస్త్రాలు సేకరించారు. పనులను పరిశీలించి, వాటి వివరాలను వచ్చే నెల 8న నిర్వహించే ప్రజావేదికలో వెల్లడిస్తారు.

భగత్‌సింగ్ జయంతి

నిర్మల్, న్యూస్‌టుడే: ఆంగ్లేయుల చెర నుంచి భారతమాత విముక్తి కోసం అసమాన పోరాటం చేసిన భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాష్ అన్నారు. శనివారం స్థానిక ఇంద్రానగర్‌లోని సంఘ కార్యాలయంలో ఆయన జయంతిని జరిపారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు మహేశ్, నితిన్, విద్యార్థులు పాల్గొన్నారు.


భైంసా మండలం చుచుంద్ ప్రభుత్వ పాఠశాలలో భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నిర్మల్: భగత్‌సింగ్ జయంతిని శనివారం సీపీఎం ఆధ్వర్యంలో జరిపారు. స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా నాయకుడు సురేశ్, కార్యదర్శివర్గ సభ్యురాలు బి.సుజాత, సభ్యులు పి.గంగామణి, ఇంద్రమాల, సుగుణ, శారద, తదితరులు పాల్గొన్నారు.

భైంసా గ్రామీణం: మండలంలోని మహాగాం, దేగాం, చుచుంద్‌తో పాటు ఆయా గ్రామాల్లో భగత్ సింగ్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు.

దస్తూరాబాద్: భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నూతన్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలల్లో, బుట్టాపూర్ భగత్‌సింగ్ విగ్రహం వద్ద నాయకులు, గ్రామస్థులు, యువకులు ఘనంగా నివాళులర్పించారు.

లోకేశ్వరం: భగత్‌సింగ్ జయంతిని శనివారం లోకేశ్వరంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కపిల్, సుధీర్‌రెడ్డి, పలువురు యువకులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితాల ప్రదర్శన

కుంటాల, న్యూస్‌టుడే: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు శనివారం ఓటరు తుది జాబితాను ప్రదర్శించారు. ఆయా పంచాయతీల పరిధిలో సుమారు 18,838 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీడీఓ తాటికొండ లింబాద్రి, ఎంపీఓ అబ్దుల్ రహీం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సారంగాపూర్: మండల ఓటరు తుది జాబితాను పూర్తి చేశారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు తుది జాబితాను శనివారం ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, తహసీల్దార్ ఎస్.శ్రీదేవితో కలిసి ప్రదర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శనకు ఉంచారు.

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఓటరు జాబితాను విడుదల చేశారు. బాదనకుర్తి గ్రామంలో ఎంపీవో రత్నాకర్‌రావు, ఎంపీడీవో సునీత, పంచాయతీ కార్యదర్శి సురేందర్ ఆధ్వర్యంలో ఈ జాబితాను విడుదల చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులతో రహదారులను శుభ్రం చేయించారు.

నర్సాపూర్(జి): మండలంలోని అన్ని గ్రామాల్లోని ఓటర్ల తుది జాబితాను శనివారం ఎంపీడీవో పుష్పలత విడుదల చేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

అక్రమ కేసులు ఎత్తివేయాలని నిరసన

నిర్మల్, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నా సందర్భంగా సంఘ నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ వసతిగృహం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు తీర్చకుండా నాయకులను అరెస్ట్ చేసి అక్రమ కేసులు నమోదు చేయడం సరైంది కాదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చంద్రపూలె దిగంబర్, కార్యదర్శి నామత్కర్ నవీన్, నాయకులు దీపక్, రాజు, చంద్రకాంత్, పవన్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీగా ఏర్పాటు చేయించండి

లోకేశ్వరం: తమ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయించాలని కోరుతూ మండలంలోని పంచగుడి అనుబంధ మొహాల గ్రామస్థులు శనివారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు విన్నవించారు. పంచాయతీ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న మొహాల గ్రామస్థులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

భైంసా: నియోజకవర్గంలో మండలానికో పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అనసూయ పవార్ ట్రస్టు వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను శుక్రవారం రాత్రి ట్రస్టు ఆధ్వర్యంలో సత్కరించారు. ట్రస్టు అధ్యక్షుడు డా.సతీశ్ పవార్, పీఆర్టీయూ, ఎస్టీయూ, తపస్ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు, నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులు, భాజపా నాయకులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం

నిర్మల్, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. శనివారం స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన సంఘ జిల్లా సమావేశంలో మాట్లాడారు. రెండేళ్ల నుంచి లెప్రసీ సర్వే, పల్స్‌పోలియో పారితోషికం చెల్లించడం లేదని చెప్పారు. గర్భిణులను ప్రసూతి ఆసుపత్రికి తీసుకెళ్లిన సమయంలో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆశా కార్యకర్తల సంఘ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.చంద్రకళ, ప్రధాన కార్యదర్శి పి.గంగామణి, గౌరవ అధ్యక్షురాలు బి.సుజాత, ఉపాధ్యక్షులు ఇంద్రమాల, సుగుణ, పద్మ, కోశాధికారి రామలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1380 కేసుల పరిష్కారం

భైంసా: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని భైంసా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి డి.దేవేంద్రబాబు అన్నారు. శనివారం భైంసా కోర్టులో మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1,380 కేసులను పరిష్కరించారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నవారు లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. పీపీ అరుణ, బ్యాంకు, అటవీ, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కార్మికులు

ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

నిర్మల్, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవలు, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయకులు పీరాజి, సాయులు, రేంజర్ల భారతి, సాయిబాబా, లింగన్న, సిద్ధు, గంగన్న, ఆకాష్, సాయి, రవి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

కుభీరు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామంలో ఈనెల 26న ఇంట్లో ఒంటరిగా ఉన్న వివాహిత(31)పై అత్యాచారం చేసి పారిపోయిన జాదవ్ సాహెబ్‌రావు (40) అనే వ్యక్తిని శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని భైంసా గ్రామీణ సీఐ నైలునాయక్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా.. వివాహితపై కన్నేసిన నిందితుడు ఆమెను లోబర్చుకోవడానికి ఆరు నెలలుగా ప్రయత్నాలు చేశాడు. బాధితురాలి భర్త విషయం గమనించి నిందితుడిని మందలించారు. దీంతో ఆ విషయం మనసులో పెట్టుకొని ఆమెపై అత్యాచారం చేశాడు. తన ఫోన్, బాధితురాలి ఫోన్‌ను తన ఇంట్లో దాచిపెట్టి పారిపోయాడు. నిందితుడి కోసం ఎస్సై రవీందర్ బృందం మహారాష్ట్ర, తదితర ప్రాంతాల్లో గాలించింది. నిందితుడు స్వగ్రామానికి వస్తున్నట్లు సమాచారం అందుకుని అతడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నైలునాయక్, చిత్రంలో నిందితుడు సాహెబ్‌రావు

ప్రైవేటు ఆసుపత్రిలో శిశువు మృతి

భైంసా, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మూడు రోజుల క్రితం జన్మించిన ఆడశిశువు శనివారం మృతి చెందింది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీరు మండలం రాజురా గ్రామానికి చెందిన కొట్టె ఆనంద అనే గర్భిణికి గురువారం పురుటి నొప్పులు రావడంతో కుటుంబీకులు వెంటనే ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అదే రోజు ప్రసవం కాగా ఆడ శిశువునకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో శనివారం శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే తమ బిడ్డ మృతికి కారణమని కుటుంబీకులు ఆరోపించారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యుడిని వివరణ కోరగా శిశువుకు పాలు పట్టించేటప్పుడు జాగ్రత్తలు పాటించక పోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలు కన్నుమూత

దిలావర్‌పూర్: మండలంలోని లోలం గ్రామానికి చెందిన శతాధిత వృద్ధురాలు ఆశాబీ బేగం శనివారం మృతి చెందారు. గ్రామంలో అందరి కంటే కురువృద్ధురాలు మృతి చెందడంతో గ్రామస్థులు చింతించారు. అప్పటి కాలపు ఆహార అలవాట్లు పాటించడంతోనే ఎక్కువ కాలం జీవించారని కుటుంబసభ్యులు తెలిపారు.


ఆశాబీ బేగం

భాజపాతోనే అభివృద్ధి సాధ్యం

నిర్మల్ పట్టణం: భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. ఈ కారణంగానే పార్టీ సభ్యత్వ నమోదులో యువత, మహిళలు పెద్దసంఖ్యలో భాగస్వాములయ్యారన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, నియోజకవర్గ కన్వీనర్ గాదె విలాస్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని అంబారీపేటలో భాజపా మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ కాసవేణి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. గ్రామంలో గడప గడపకు వెళ్లి సభ్యత్వ నమోదు చేయించారు. పార్టీ బూత్ అధ్యక్షుడు కొప్పుల భూమన్న, మిల్కూరి సతీష్, నరేందుల ప్రసాద్, యాతం రాజు, నరేశ్, జంగం సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రజలందరూ భాగస్వాములు కావాలి

కుంటాల: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములైతే సత్ఫలితాలు సాధించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఆ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పెంచికల్‌పాడ్, అందకూర్ గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. అనంతరం శ్రమదానం చేశారు. ఎంపీడీఓ తాటికొండ లింబాద్రి, ఎంపీఓ అబ్దుల్ రహీం, ఏపీఓ నవీన్, ఏపీఎం అశోక్, సీసీ పెంటన్న, కార్యదర్శులు సారిక, రమ్య, వీఓఏలు, మహిళలు పాల్గొన్నారు.

పెంబి: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీఓ రమాకాంత్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మందపల్లి కేజీబీవీ పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించారు. ఏపీవో రాజశేఖర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి కమల్‌నయన్, పార్టీ మండలాధ్యక్షుడు పోలాస గోవర్ధన్, మండల కన్వీనర్ అడ్వాల రమేష్, జిల్లా నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: ప్లాస్టిక్ నివారణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తహసీల్దార్ స్వాతి, ఎంపీడీవో అరుణకుమారిలు అన్నారు. శనివారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా లోలం, గుండంపల్లి గ్రామంలో ప్లాస్టిక్ నివారణ చేయాలని దుకాణ సముదాయాల్లో, ఇంటింటా అవగాహన కల్పించారు. అంతకు ముందు గ్రామ పంచాయతీలో ఎన్నికల ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఎంపీవో గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆహార పట్టిక అమలు చేయండి

కుభీరు: విద్యార్థులకు పట్టిక ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీడీఓ నవనీత్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం కుభీరులోని బాలికల ఆశ్రమ పాఠశాలను వారు తనిఖీ చేశారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీఓ మోహన్‌సింగ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అప్రమత్తత అవసరం

నిర్మల్ గ్రామీణం: హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ అప్రమత్తత చర్యలతోనే సాధ్యమవుతుందని మండల విద్యాధికారి పి.వెంకటేశ్వర్ అన్నారు. శనివారం చిట్యాల్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, క్షయ, మలేరియా వంటి పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గాయకుడు నాగరాజు, ఉపాధ్యాయులు గజపల్లి నర్సయ్య, లక్ష్మిప్రసాదరెడ్డి, కుమార్, వాహిద్, సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

నిర్మల్: ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో రేబిస్ వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పశు వైద్య సంయుక్త సంచాలకుడు ఎం.డి.బలేగ్ అహ్మద్ రేబిస్ వ్యాధిపై సూచనలు చేశారు. ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ డా.కరుణాకర్, వెటర్నరీ అసిస్టెంట్ జె.అనిత, సీహెచ్.క్రాంతి, సిబ్బంది ప్రశాంత్, ఎల్లన్న పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై రేపు సదస్సు

కడెం: పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగుపై ఈ నెల 30న జన్నారం మండలం పొనకల్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు టీపీ రాములు తెలిపారు. పట్టు పురుగుల పెంపకం వల్ల కలిగే లాభాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పెంబి: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. శనివారం పెంబి రైతువేదికలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీఓ అనిల్, సీడీపీఓ సరిత, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

లక్ష్మణచాంద: ప్రాథమిక స్థాయిలోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి అశోక్‌వర్మ అన్నారు. మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాలలో ఆయా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రూం టు రీడ్ మండల సమన్వయకర్త గోవర్ధన్‌నాయుడు, తెలుగు బోధన రిసోర్స్‌పర్సన్ సాయన్న, రాజేశ్వర్, సీఆర్పీలు సుధాకర్, మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

భైంసా గ్రామీణం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు బోధిస్తున్న ఉపాధ్యాయులకు గణిత సామర్థ్యాల సాధనపై రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో దేగాం ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షణ నిర్వహించారు. మండల విద్యాధికారి ఎ.సుభాష్, ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, ఆర్పీలు జి.రాజేశ్వర్, హన్మాండ్లు, రూమ్ టు రీడ్ ప్రతినిధి సయ్యద, సీఆర్పీ పోతన్న తదితరులు పాల్గొన్నారు.

సందర్శన

నిర్మల్ గ్రామీణం: జిల్లా బోధనాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని హైదరాబాద్‌లోని నిమ్స్ నెఫ్రాలాజిస్టులు కార్తీక్, శశాంక్ శనివారం సందర్శించారు. రోగులకు సేవలను, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

లభించని మహిళ ఆచూకీ

ముథోల్(బాసర): బాసర గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరిస్తూ శుక్రవారం గల్లంతైన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం దర్మోర గ్రామానికి చెందిన జయ ఆచూకీ శనివారం సాయంత్రం వరకు లభించలేదు. బాసర పోలీసుల ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు 5 కిలోమీటర్ల దూరం వరకు వెదికారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో సాధ్యపడలేదు. మహిళ ఆచూకీ కోసం లోకేశ్వరం, నర్సాపూర్(జి), సోన్ పోలీసులతో పాటు గోదావరి పరీవాహక ప్రాంత గ్రామాలను అప్రమత్తం చేసినట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు.

నీటి వనరులను పొదుపుగా వాడితేనే మనుగడ

నర్సాపూర్(జి): పంటలకు నీటి వనరులను పొదుపుగా వాడితేనే భూగర్భజలాలు సమృద్ధిగా ఉంటాయని వాలాంతరి రాష్ట్ర సంచాలకురాలు సునీత అన్నారు. శనివారం మండలంలోని నర్సాపూర్(జి) రైతు వేదికలో మండల వ్యవసాయాధికారులకు శిక్షణ నిర్వహించి మాట్లాడారు. బిందుసేద్యం వంటి సూక్ష్మనీటి వనరులతో నీటిని ఆదా చేస్తూ పంటలను పండించాలని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, వాలాంతరి ఏడీఏ అన్నపూర్ణ, ఏడీఏ భాస్కర్, ఏవో రామచందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఖానాపూర్: గామపంచాయతీల్లో దశాబ్దాల నుంచి పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఖానాపూర్ మామడ, జన్నారం మండలాల కారోబార్ సంఘం నాయకులు శనివారం ఉట్నూరులో ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు వినతిపత్రం అందజేశారు.

వైద్యశిబిరం

నిర్మల్ గ్రామీణం: కాలానుగుణ వ్యాధులు సోకుతున్న దృష్ట్యా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని మంజులాపూర్ వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పీవో డా.శ్రీనివాస్, హెచ్ఈవో శేషయ్య, ఆరోగ్య సహాయకులు శోభారాణి, రాజేశ్వర్ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ ప్రకాష్

క్రీడా సమాచారం

జోనల్ స్థాయికి విద్యార్థుల ఎంపిక

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి) మైనార్టీ గురుకుల విద్యాలయ విద్యార్థులు వివిధ ఆటల్లో చక్కటి ప్రతిభ కనబరిచారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో జరిగిన పోటీల్లో బాగా ఆడిన ముగ్గురు విద్యార్థులు జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి సురేంద్ర వాలీబాల్, పదో తరగతి విద్యార్థులు సాయిరాం, జశ్వంత్‌లు హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభను చూపి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ ప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుడు రిజ్వాన్, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

కడెం నుంచి..

కడెం: అండర్-17 వాలీబాల్ జోనల్‌స్థాయి పోటీలకు కడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని దుమ్మని భార్గవి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణ తెలిపారు. జిల్లాస్థాయి పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి జోనల్‌కు ఎంపికైనట్లుగా వారు పేర్కొన్నారు.

నేడు నిర్మల్‌లో కరాటే పోటీలు

నిర్మల్ పట్టణం: చుక్క ధర్మరాజ్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో ఆదివారం జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ముఖ్య న్యాయనిర్ణేత రాపోలు సుదర్శన్ చెప్పారు. శనివారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన ధర్మరాజ్ పేరిట చేపట్టిన ఈ పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. 8 నుంచి 32 ఏళ్ల వయసున్న వారు వివిధ విభాగాల్లో పోటీపడుతారని చెప్పారు. సమావేశంలో తేజేందర్‌సింగ్, కొండాజి శ్రీకాంత్, భూషణ్, స్వామి, సాయికృష్ణ, మృణాళిని తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సహాయం

తానూరు(భైంసా): ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొన్న మండలంలోని గైక్వాడ్ మమత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆర్థిక ఇబ్బందులతో పంజాబ్‌లో నిర్వహించే జాతీయ పోటీలకు ఆమె దూరమవుతున్నట్లు తెలుసుకున్న సమతా సుదర్శన్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సమతా సుదర్శన్ శనివారం తానూరులో క్రీడాకారిణికి రూ.24వేల ఆర్థిక సాయం అందించారు. తానూరు మాజీ సర్పంచి మాధవ్‌రావు పటేల్, పుండలిక్, దేవదాస్, మాణిక్ తదితరులు ఉన్నారు.


కబడ్డీలో ప్రత్యర్థి జట్టు సభ్యుల చేతుల్లోంచి తప్పించుకుని వెళ్తున్న ఆటగాడు

ఆటలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఆసక్తి ఉన్న క్రీడలను ఎంచుకుని అందులో ప్రావీణ్యం పొందిన జాతీయ స్థాయి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని రాణించాలని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. శనివారం మండలంలోని సిర్గాపూర్ 'ఫ్లేర్' పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీందర్‌గౌడ్, జిల్లా నాయకులు శ్రీనివాస్, రమణారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్, గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..

నిర్మల్ పట్టణం: విశ్వహిందూపరిషత్, గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక దేవరకోట దేవస్థానంలో శనివారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. హిందూ ధర్మరక్షణకై మీ వంతు పాత్ర అనే అంశంపై వ్యాసరచన, రామాయణం, మహాభారతం, భాగవతం, జీకేపై క్విజ్, దేశభక్తి- దైవభక్తి గీతాలాపన, హనుమాన్ చాలీసా పఠనంపై పోటీలు చేపట్టారు. 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు దసరా రోజు బహుమతులు అందజేస్తామన్నారు. ఆమెడ శ్రీధర్, ముప్పిడి రవి, మూర్తి ప్రభాకర్, రాజేందర్, జనార్దన్, రాఘవులు పాల్గొన్నారు.